# ప్రవాసం

ఇక నేనెట్లా బ్రతకాలి? నాకు దిక్కెవరు? నాకు దారేమిటి? అని మళ్ళీ మళ్ళీ అనుకొంటూ దీర్ఘ నిశ్వాసాలు విడుస్తూ పూరి గుడిసె ముందు కూర్చుని ఉండిపోయాడు పేరయ్య. పొర్లిపొర్లి వస్తున్న దుఃఖం ఆపుకోలేక వెక్కివెక్కి ఏడుస్తూ మధ్య మధ్య కళ్ళనీళ్ళు తుడుచుకొంటున్నాడు.

సూర్యుడు పగలంతా ఆకాశ మార్గాన ప్రయాణం చేసిచేసి పశ్చిమాన చింతతోపు వెనుకగా అస్తమించబోతున్నాడు. చింతతోపంతా ఎఱ్ఱవారింది. చింత చిగుళ్ళు ఎఱ్ఱని సూర్యకాంతులలో మెరసిపోతూ గాలికి కదులుతూ కులుకుతున్నాయి.

కాని పేరయ్యకు సూర్యు డస్తమించబోతున్న విషయం పట్టనేలేదు. సూర్యు డుదయించినప్పుడూ ఆ విషయం పట్టలే దతనికి. ఇప్పుడీ విషయమూ పట్టలేదు. అసలు అతనికి తిండివిషయ మొకటి పడితేగదా ఇతర విషయాలు పట్టడానికి. తండ్రి పోయిన ఆరెండు రోజు నుంచీ అతనల్లాగే ఉన్నాడు.

పేరయ్య తండ్రి వెంకన్న మొదట్లో కాస్త కలవాడే. రెండెకరాల స్వంతభూమీ, కవులుకు పుచ్చుకొన్నది మరి కొంతా కలుపుకొని వ్యవసాయం చేసుకొంటూ కృష్ణాపురంలో జీవనంగడుపుతూ వచ్చాడు. ఎగుడు దిగుళ్ళు లేకుండా సంసారం సాఫీగానే సాగింది సాగినంతకాలం. పద్నాలుగేళ్ళ క్రిందట పుట్టిన పేరయ్య తరువాత మళ్ళీ సంతానం కలుగకపోయినా ఆ విషయమై వెంకన్న ఎన్నడూ

ఏమీ బాధపడలేదు. అతనూ అతని భార్యా పేరయ్యను ఎంతోగారాబంగా పెంచారు.

వరుసగా నాలుగేళ్ళు పొలాలు పండక పోయేసరికి వెంకన్న అప్పులపాలయ్యాడు. కష్టాలన్నీ ఒక్కసారే వచ్చాయి. భార్య జబ్బుపడి మంచాన పడ్డది. ఆమెకు వాడిన మందులకూ మాకులకూ బోలెడు ఖర్చయింది. చివరకో రోజున ఆమె తను గారాబంగా పెంచు కొంటున్న కొడుకునూ, తన జబ్బు నయం చేయించాలని తాపత్రయ పడుతున్న భర్తనూ వదలి వెళ్ళిపోయింది.

ఆవిడ చావుతో ఆ కుటుంబం కూలిపోయింది. వెంకన్నకు అప్ప టికే వయస్సు మళ్ళింది. అతను ఇటు భార్యా వినియోగానికి తాళలేక, అటు అప్పులవాళ్ళు పెట్టే బాధలకు వేగలేక, అటు అప్పులు తీర్చే మార్గాంతరాలు కన్పించక, ఇటు ఇల్లు దిద్దుకొనే దారి తెలియక దిగులుపడి, దిగులుపడి మంచాన పడ్డాడు. చివరకు తనకున్న పొలమంతా అప్పులవాళ్ళకు వ్రాసి ఋణ విముక్తుడయ్యాడు. దాంతో దారిద్ర్య మాయింట్లో తాండవించింది. ఆ తరువాత మూడు నెలలకు తాను దరిద్రమనుభవిస్తూ దాన్నే కొడుక్కు ఆస్తిగా మిగిల్చి పరలోకాల్లో సంపదలూ, దారిద్ర్యమూ అనేవి ఉంటాయో ఉండవో చూద్దామని వెళ్ళిపోయాడు.

అప్పటిదాకా తల్లి దండ్రులచాటున గారాబంగా పెరిగి ఒక్కసారి దిక్కులేనివాడై పోయేసరికీ పేరయ్యకు ఏం చెయ్యాలో, ప్రపంచంలో ఎల్లా బ్రతకాలో పాలుపోలేదు.అందుకనే అతనల్లా ఏడుస్తూ కూర్చుండి పోయాడు.

పొలంవెళ్ళి తిరిగివస్తూ చింతతోపుకు దగ్గరగా ఉన్న వెంకన్న గుడిసెముందుగా వెళుతూ పేరయ్యనుచూచారురామయ్యగారు. 'అదేమిటిరా అబ్బీ! అసురసంధ్యవేళ అల్లా ఏడుస్తూ కూర్చు న్నావు' అంటూ దగ్గరకు వచ్చి కాసేపు ఓదార్చి "చూడ్రా అబ్బీ!

మనబోటివాళ్ళకు జరిగిపోయినదానికి ఏడుస్తూ కూర్చుంటే ఎల్లా గడుస్తుందిరా?...అదంతా మర్చిపో. పోయి ఏదైనా కష్టం చెయ్యి. భుక్తి గడుస్తుంది. లేలే!" అని అతని చేతిలో ఓరూపాయి పెట్టి రామయ్యగారు వెళ్ళిపోబోతుంటే పేరయ్య అమాయకంగా "ఏమండీ రామయ్యగారూ! ఎవర్ని అడగమంటారండీ? ఇప్పుడెవర్ని అడిగినా పని దొరికేటట్లు కన్పించడం లేదు. కాస్త మీరే ఎక్కడైనా నన్ను ఏదో పనికి కుదర్చండి?" అని అన్నాడు. ఆయన కొంచెం విసుక్కొంటూ "అవన్నీ నేనెక్కడ చూస్తాను! ఏదో పాపం అని ఓమాట చెప్పాను." అంటూ వెళ్ళిపోతూ నాలుగడుగులువేసి, మళ్ళీ వెనక్కు తిరిగి "చూడు పేరయ్యా! మనఊళ్ళో మంచినీళ్ళకు చాలా ఎద్దడిగా ఉందికదా!...నువ్వు ఓపని చెయ్యవచ్చు; ఓ కావడి వేసుకొని, పొరుగున ఉన్న మంచినీటి బావికి వెళ్ళి నీళ్ళు తెచ్చి పదిమంది ఇళ్ళల్లోపోస్తే అదో జీవనాధారం కాకపోదు. చూడూ అదే మంచిది–అల్లాచెయ్యి–నీకు–కావాలీ అంటే కావడీ, కుండలూ నేనిస్తానురా–రా–ఈపూట మా యింట్లోనే భోజనం చేసి అవి రేపు తెచ్చుకొందువుగాని" అని చెప్పి కిర్రు చెప్పులు చప్పుడు చేసుకొంటూ రామయ్యగారు వెళ్ళిపోయారు.

రామయ్యగారు వెళ్ళిన తర్వాత పేరయ్య కొంతసేపు ఆలోచించాడు. ఎంత ఆలోచించినా అంతకంటే వేరే ఉపాయం తోచలేదు. "సరే ఇప్పటికిదే బావుంది" అనుకొని అందుకు సిద్ధమయాడు మరునాడు ఉదయాన్నే దానికి కావలసిన ఏర్పాట్లు పూర్తిచేసుకొన్నాడు.

ఊళ్ళోకల్లా వీరయ్య చౌదరిగారూ, సుబ్బయ్య నాయుడుగారూ–ఈ యిద్దరే భాగ్యవంతులు. మూడోవాణ్ణి చెప్పుకోవాలీ అంటేఆఊరి షావుకారును చెప్పుకోవాలి. పేరయ్య వారి విషయమై ఆలోచిస్తూ–"ఈ ముగ్గురి యిళ్ళల్లోనూ వాడిక కుదిరిందీ అంటే, నాకు తిండి గడుస్తుంది. అనుకొంటూ ముందు నాయుడుగారింటికి వెళ్ళాడు. ఆయన వీథి

అరుగుమీద కూర్చుని పళ్ళు తోముకుంటూనే "ఏరా పేరయ్యా ఇల్లా వచ్చావు...అవును పాపం అంతా అల్లా జరిగిపోయింది...చివరి కల్లా జేసిపోయాడు వెంకన్న. సరేగాని మరిప్పుడేం చేద్దామనుకుంటున్నావు?" అంటూ పలుకరించారు. పేరయ్య చేతులు కట్టుకొని నిలబడి తనసంగతి చెప్పుకొన్నాడు. ఆయన మారుమాట చెప్పకుండా "బిందెకు రూపాయి యిస్తాను. ఓ ఐదు బిందెలు పోస్తూఉండు" అన్నారు నాయుడుగారు.

అదేవిధంగా వీరయ్యగారితోనూ చెప్పుకోగానే ఆయనా వెంటనే సరే అన్నారు. "బాగానే ఉంది పేరయ్యా అల్లాగే చెయ్యి–మన యింట్లో పది పన్నెండు బిందెలు పొయ్యి-చూడూ ముందిక్కడ పని అయ్యాక తర్వాత ఎక్కడైనా పోసుకో" అని చెప్పారు. పేరయ్య సంతోషంగా సరే నండీ అని షావుకారుదగ్గరకు వెళ్ళాడు. కొట్టుమీద కూర్చున్న షావుకారు పేరయ్యను చూడగానే "ఏంరా పేరిగా! ఇల్లా వచ్చావు! సరుకేమైనా కావాలా? పట్టుకెళ్ళు; కాని అప్పు మాత్రం పుట్టదు. అసలు అప్పు ఇవ్వడమంటే నాకు గిట్టదని నీకు తెలుసుగా" అన్నాడు.

"అబ్బే అదికాదండీ–విషయమేమిటంటే..."చూడండి షావుకారు గారూ! ఈ ఊళ్ళో పుట్టి పెరిగానా; ఏదో విధంగా బ్రతకాలా...వాళ్ళిద్దరూ సరే అన్నారు; మీరో నాలుగు బిందెలు పోయించుకొన్నారంటే నాకోవిధంగా తిండికి గడుస్తుంది." అంటూ ప్రాధేయపడుతూ తను వచ్చిన సంగతి వివరించాడు. "ఆ బాగానే వుంది; నేనూ అనుకొంటూనే వున్నా...మొన్న వాడు లేడూ–ఆ గోపాలంగాడు వాడు పోస్తానన్నాడు. ఊళ్ళో అందరికీ అవసరం కానప్పుడు నాకుమాత్రం దేనికీ అని ఊరుకొన్నా–నువ్వేదో బ్రతిమాలుతున్నావా...సరే పొయ్యి నాకూ నాల్గు బిందెలు, అయితే బిందె అర్ధరూపాయికాడికి చేసి పొయ్యి" అన్నాడు షావుకారు.

అదేమిటండీ షావుకారుగారూ! వాళ్ళకో రేటూ మీకోరేటూనా అండీ..., అది ధర్మమేనా! నామీద దయవుంచి మీరూ ఆకాడికే పోయించు కోండి" అన్నాడు పేరయ్య బ్రతిమాలుతూ.

ఆబ్బే-ఆకాడికి నాకు గిట్టదురా!" అన్నాడు షావుకారు - అదీ ఒక వ్యాపారంలాగానే. కాని పేరయ్య అతన్ని వదలలేదు. చివరకు ఇద్దరకూ ఒక ఒప్పందం కుదిరింది—బిందె ముప్పావలాకు పోసేటట్టూ ఆవార అతనికి ఇచ్చే సరుకులో షావుకారు కాస్త లాభం తగ్గించుకొని ఇచ్చేటట్టూ.

ఆ మరునాటినుండే పని మొదలుపెట్టాడు పేరయ్య. తెల్లవారకే ముందే నాలుగు గంటలకల్లా లేచి బావికి వెళ్ళి నీళ్ళకావడి భుజాన పెట్టు కొని ఉరుకులు పరుగులుతీస్తూ, ఈల వేసుకొంటూ ఊళ్ళోకి వచ్చేవాడు. పని మొదలు పెట్టాక విచారం అంతా పోయింది. మొదట్లో బావినుంచి పది పన్నెండు సార్లు తిరగడమంటే అట్టే కష్టమనిపించలేదు. అందువల్ల ఇంకా కొన్ని చిన్న చిన్న బేరాలు వస్తేకాదనలేదు. మొత్తంమీద నెలకో ముప్పయి రూపాయలు గిట్టుతూ వచ్చాయి. పని ఎక్కువయినకొద్దీ పూర్వం కంటే ఇంకా పెందరాళే నిద్రలేవడం నేర్చుకొన్నాడు. ప్రొద్దున మూడు గంటలకు మొదలుపెడితే మధ్యాహ్నం పదకొండు గంటలకల్లా పని పూర్తి య్యేది. ఇంటికివస్తూ దారిలో అక్కడా అక్కడా కాసేపు ఆగి పన్నెండు కాకముందు గుడిసె చేరుకొని అప్పుడు వంటచేసుకొనేవాడు.

పేరయ్యకు మొదట్లో-చిన్నదే అయినా బావురుమంటున్న ఆ గుడిసెలో ఒంటరిగా భోజనం చెయ్యడమన్నా, నిద్రపోవడమన్నా ఏదో దిగులుగా భయంగా ఉండేది. కాని క్రమంగా అలవాటు అయ్యింది. నెమ్మదిగా తనకు ఇంట్లో కావలసిన వస్తువులన్నీ ఒకటొకటీ కొనుక్కు న్నాడు, ఒక నులకమంచం, రెండు గొంగళ్ళు, ఓజత ముతకే పంచలూ అవీ కొనడం పడింది.

కావడి కుండల స్థానంలో తెల్లగా మెరుస్తున్న కడవలువచ్చాయి. కావడిబద్దకు మధ్య మధ్య పట్టీలు వేయించాడు. తర్వాత నాయుడుగారి దగ్గర పదీ పరకా దాచుకోవడం మొదలు పెట్టాడు పేరయ్య.

నాయుడుగారు వారి పెద్దమ్మాయి వివాహం ఆ సంవత్సరమే చేశారు. ఆ నాలుగు రోజులూ వచ్చిన చుట్టాలకూ, స్నేహితులకూ నీళ్ళు అవీ అందిస్తూ రాత్రింబవళ్ళు అక్కడే గడిపాడు పేరయ్య. ఆ నాల్గు రోజులకూ నాయుడుగారు అతనికి మరో పదిరూపాయలు అదనంగా ఇచ్చారు. అల్లావచ్చిన పదీ కాకుండా పేరయ్యకు మరొకవిధంగా కొంత డబ్బు లభించింది అనుకోకుండా. నాయుడుగారి కొత్త అల్లుడు స్నానానికి దొడ్లోకివచ్చి చేతిగడియారం తీసి బావిగట్టుమీద పెట్టి దానిమీద తువ్వాలుపడేసి. స్నానం చేసి. తువ్వాల చివాలున లాగేసరికి అది బావిలో పడిపోయింది. అదో పెద్దబావి. అందులోనూ ఉప్పులు కావడంచేత ఆబావినీటి వాడకం తక్కువ. అందువల్ల అది చాలా లోతు.

కొత్త అల్లుడు చాలా గాబరా పడ్డాడు. ఆ చేతిగడియారం ఖరీదు రెండు వందలు. పెళ్ళిలో పెట్టింది. అప్పుడే పోయింది అంటే అందరూ నవ్వుతారు. అందుకనే పేరయ్యను పిలిచి వాడికి అనేకవిధాల చెప్పి "ఒరేయి నువ్వుగనుక అది తీసియిస్తే నీకు పాతిక రూపాయలు బహుమానం ఇస్తానురా" అన్నాడు. పేరయ్య భయపడుతూ, భయపడుతూ బావిలో దిగాడు. మొదట్లో లోతు అంతుపట్టలేదు. అరగంటసేపు నానా అవస్థపడి మొత్తంమీద ఆపని సాధించాడు పేరయ్య. కాని ఆ అబ్బాయి డబ్బు ఇస్తుంటే-ఆ డబ్బు చూడగానే అంత డబ్బు తనకు ఎంత కష్టపడితే వస్తుందా అని ఆలోచించాడు. "చూడండి చిన్నయ్యగారూ. డబ్బు మాత్రం ఇవ్వద్దు; అయ్యగారికి తెలిస్తే.... అయ్యబాబో...అయినా నా కెందుకూ వద్దండీ" అని వెళ్ళిపోతూంటే ఆ అబ్బాయి వెంట వెళ్ళి బలవంతపెట్టి "తీసుకోరా! నువ్వు నిజంగా నా పరువు కాపాడావు—

అయినా నేనేమైనా కష్టపడి సంపాదించానా ఏమన్నానా—నాకు పదివేలు కట్నమిచ్చారు-అందులోనుంచి ప్రస్తుతానికి నాకో వెయ్యి స్వంత ఖర్చుల క్రిందచిక్కాయి. పుచ్చుకో...అయినా నేనెవరితో అనను" అన్నాడు.

చివరికా డబ్బు పేరయ్య పుచ్చుకోక తప్పిందికాదు. ఆ డబ్బు కూడా నాయుడుగారిదగ్గరే దాచుకొన్నాడు. ఆ యేడాది చివరిలో అంతా కలిపి నాయుడుగా రతనికి తొంభై రూపాయ లిచ్చారు. అతను ఆ డబ్బు బొడ్డులో పెట్టుకొని ఓ రోజంతా ఎంతో ఆనందంగా తిరిగాడు. ఎంతో ఆలోచించాడు. మరురోజురాత్రి చౌదరిగారు భోజనానంతరంచుట్ట కాలుస్తూ దొడ్లో మంచంమీద కూర్చున్నప్పుడు వారికి దూరంగా నేలమీద ఆయన కాళ్ళ దగ్గరగా కూర్చున్నాడు పేరయ్య. కొంతసేపు అయ్యాక పేరయ్య వినయంగా "అయ్యగారూ—మీదయవల్ల భుక్తికి ఏలోటూ లేకుండా గడుస్తోంది. మీరందరూ నన్నెంతో దయగా చూస్తున్నారు. అందువల్లనే నాకు ఓ పదిరాళ్ళు మిగిలినాయి. ఇప్పుడు నాదగ్గిర తొంభై రూపాయలున్నాయి. దానికి మీరు పదోపరకో కలిపితే నాకోపని చేదామని వుంది...ఓ చిన్న పీపాబండి కొందామని వుందండీ..." అంటూచెబుతూ ఆశగా వారివంక చూస్తూ ఉండిపోయాడు పేరయ్య. చౌదరిగారు ఒక్కక్షణం ఆలోచించి "సరేపో వెళ్ళి వడ్రంగిని కనుక్కో; నీదగ్గర వున్న దంతా ఇచ్చేసి మిగతాది నేనిస్తానని చెప్పి చేయించుకో." అన్నారు.

పేరయ్యకు పట్టరాని సంతోషం కలిగింది. వారిని ఎల్లా అభినందించాలో అతనికి తెలియలేదు. "అయ్యగారూ! ఆ ఋణంలో కొంత భాగం నేను నీళ్ళుపోసి తీర్చుకొంటానండీ" అన్నాడు పేరయ్య. "అన్నీ యేడ్చావులే పోరా! పోయి చేయించుకో. తర్వాత చూద్దాం మిగతా సంగతులు—సరే ఇహ వెళ్ళు—పోయి పడుకో" అన్నారు చౌదరిగారు.

పేరయ్య దారిపొడుగునా వీరయ్యచౌదరిగారి గుణగణాలను వేయివిధాల పొగడుతూ, వారికి సంపూర్ణమైన ఆరోగ్యమూ, సంపదా

కలుగచేయమని దేవుడికి పదిసార్లు మ్రొక్కుకుంటూ ఇల్లుచేరుకొన్నాడు.

x x x

పేరయ్య ఊహించిన దానికంటే వెయ్యి రెట్లు అమరికగా కుదిరింది పీపాబండి. దాన్ని ప్రస్తుతానికి చేతులతోనే లాక్కుపోవడానికీ, ముందు ముందు వీలుపడితే ఓచిన్న ఎద్దును దానికే కట్టుకోడానికీకావలసిన ఏర్పాటుతోనే చేసి యిచ్చాడు వడ్రంగి.

ఒక మంచిరోజు చూచుకొని పీపాకు ముందు వైపు పసుపు రాచి కుంకుమ బొట్టుపెట్టి, కొబ్బరికాయలు కొట్టి దాన్ని ఊళ్ళోంచి బావికి సంతోషంగా గర్వంగా లాక్కుని వెళ్ళాడు పేరయ్య. అతని వయసు వాళ్ళే ఆ ఊళ్ళో సోమరిపోతుల్లాగా తిరిగే కొందరు అతన్ని చూచి ముసిముసి నవ్వులు నవ్వుకొన్నారు చాటుగా. మరి కొందరు అతని ముఖంమీదే నవ్వారు. కాని పేరయ్య వాళ్ళను అసలు లెక్క చెయ్యలేదు.

కడవలతో తోడిపోస్తే దాదాపు పాతిక కడవల నీళ్ళు పట్టింది. చివరి కడవతో నీళ్ళు పీపా మూతిలోకి పోస్తూ "అమ్మనాయనో-ఇంత బరువు నేను లాగగలనా" అనుకొన్నాడు, కాని పది పన్నెండుసార్లు అటూ ఇటూ తిరగడం తప్పింది కదా అన్న సంతోషంతో దాన్ని బలంగా లాక్కుపోవడం మొదలు పెట్టాడు పేరయ్య. కాని కొంచెం దూరం పోయేసరికే అలుపు వచ్చింది.

ఆ దారినే ఎడ్లబండీమీద ఇంటికి పోతున్న రైతు ఇతన్ని చూచి క్రిందకు దిగివచ్చి "అట్లా కాదోయ్ పిచ్చిపేరయ్యా లాగుడుబండీ లాగడం" అంటూ భుజంమీద కాడి ఆనించి ముందుకు నడుస్తూ బండి లాగడం చూపించాడు. ఆవిధంగా చేసి చూచేసరికి పేరయ్యకు పీపా బండిలాగడం చాలా తెలికైన పని అని అనిపించింది. వారం గడవక ముందే ఆ బండీ లాగడం అతనికి సుళువుగా అలవాటయిపోయింది.

'కష్టపడి పనిచెయ్యాలే గాని ఏదోవిధంగా జీవితం గడవకపోదు' అనుకొన్నాడు పేరయ్య. భుజంమీద కాయలు కాయడం చూచుకొని అవి

అప్పుడప్పుడు అసహ్యమనిపించినప్పుడల్లా 'పోనీలే మరేం ఫరవాలేదు ఇంతలోకే నాకేమీ నామోషీ రాలేదు; కష్టపడి పనిచెయ్యడం నేర్చుకొన్నాను గనుకనే రోడ్లమీద అడుక్కొని తిరిగే దుర్గతి నాకు తప్పింది' అనుకొనేవాడు పేరయ్య. పీపా చేతికి వచ్చాక పేరయ్యకు బేరాలు ఎక్కువయ్యాయి. మొదట్లో ఒక్కసారి వెళ్ళివస్తేసరిపొయ్యేది, ఇప్పుడు రెండు మూడు సార్లు కూడా వెళ్ళిరావలసి వస్తోంది. పాతవాళ్ళు తప్ప కొత్తవాడికలవాళ్ళు డబ్బు కొంచెం తక్కువ ఇస్తున్నారు. అయినా పేరయ్య సంతోషంగా వాళ్ళందరికీ నీళ్ళు పోశాడు. ఏడాది తిరక్కముందే పేరయ్య నల్లగా పొట్టిగా బలంగా ఉన్న ఓ గిత్తను కొన్నాడు. గిత్తను బండికి కట్టి ఆ ఊరిమధ్య వీధిలోనుంచి బండి తోలుకొని పోతున్న రోజున వాడి హృదయంలో కలిగిన ఆనందం ఇంతా అంతా కాదు. గుడిముందు బండీ ఆపి—తాడు బండిచక్రానికి కట్టేసి, గుళ్ళోకి వెళ్ళి, దేవుడికి నమస్కారాలు పెట్టి—ఎద్దుకు పసుపూ కుంకుమా పెట్టి గర్వంగా బావికి తోలుకొని పోయాడు పేరయ్య. బండీ ఊరువదలి డొంకలోకి వచ్చాక దానిమీదకు ఎక్కి కూర్చుని 'అమ్మయ్య ఇప్పటికి నా కష్టాలు గట్టెక్కాయనే అనుకోవచ్చు' అనుకొన్నాడు.

ఒక్కొక్కరోజున ఆ డొంకలోనుంచి బండీ తోలుకొంటూవస్తూ 'భగవంతుడి దయవల్ల మా వూళ్ళోకి కంకరరోడ్డుపడితే ఎంతబావుండు అనుకొంటూ ఉండేవాడు. ఆ తర్వాత కొన్నాళ్ళు అతని జీవితం బాగా గడిచిందనే చెప్పాలి. నెలకో తొంభై రూపాయలదాకా గిట్టుతున్నాయి.

పేరయ్య కొత్త మంచి బట్టలు వేసుకొని తిరుగుతున్నప్పుడు ఆ ఊళ్ళో కొంతమంది—చూచి నిజంగా సంతోషించారు. 'పోనీలేపాపం. ఓదారిని పడ్డాడు ఇహ ఫర్వాలేదు' అనుకొన్నారు వారంతా.

అతని ఈడువాళ్ళు కొంతమంది అతన్ని చూచి 'ఒరేయ్ వాడొట్టి పీనాసిరా—కానీ పెట్టి ఓ బీడీ కూడా కొనుక్కోడు – ఇంతకుముం

దెప్పుడైనా డబ్బులు చూసినవాడైతేగా' అనుకొనేవాళ్ళు.

బలం కలవాడైనా తన ఈడువాళ్ళతో సరదాకైనా దెబ్బలాడే వాడు కాదు పేరయ్య. అందువల్ల పిల్లలు అతను పిరికివాడని. కొంత మంది పెద్దలు అతను చాలా బుద్ధిమంతుడనీ అనుకునేవాళ్ళు. నాయుడు గారి పొలం చేస్తున్న పెద్ద కాపుకు ఒక రోజున ఒక మంచి ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన తట్టినందుకు తనకుతానే అభినందించుకొంటూ గబగబా ఇంటికి వెళ్ళి భార్యతో ఆ విషయం ప్రస్తావించాడు. రెండు నిమిషాలయ్యాక తానొక నిశ్చయానికి వచ్చేస్తూ 'చూడూ! వాడు చాలా బుద్ధిమంతుడు. వృద్ధిలోకి వస్తున్నాడు. మనకంతకంటే మంచి అల్లుడు దొరుకుతాడా?—కుటుంబం విషయమా వెంకన్నబావ విషయం మనం అందరం ఎరుగున్నదే? మన పెద్దమ్మాయి చాలా సుఖపడుతుంది.నువ్వు సంతోషంగా సరే అను"అన్నాడు.

అతనారోజే వెళ్ళి తన అభిప్రాయం నాయుడుగారితో చెప్పి అందుకు ఆయన సహాయ సహకారాలు ఆపేక్షించాడు. ఆయన 'సరే లేరా-నేను చెబుతాన్లే' అన్నారు. మరునాడు పేరయ్య వచ్చి నప్పుడు నాయుడుగారు వాడితో 'చూడు పేరయ్యా-ఇవ్వాళ నీకో విషయం చెప్పాలి? ఆ ఏంలేదు. నువ్వు ఇప్పటికో దారినపడ్డావు. ఏదో నాలుగురాళ్ళు సంపాదించుకొంటున్నావు — ఇప్పుడే ఓ యింటివాడివికా మరొకటి — నీకూ వెనక దిక్కెవరూ లేరా — ఒక సంసారం అంటూ ఏర్పడితే మంచిది. అదీగాక ఈ వయస్సులో నాలుగుడబ్బులు సంపాదిస్తున్నప్పుడు ఏదైనా చెడుసావాసాల్లో పడ్డావా-ఇహ అంతే- కనుక నే చెప్పినట్టుగా పెళ్ళి చేసుకో. మనవాడు వచ్చి పిల్లనిస్తానంటు న్నాడు. నువ్వు ఇంకేమీ మాట్లాడవద్దు. ఆ తర్వాత సంసారానికి డబ్బు కెప్పుడైనా ఇబ్బందివస్తే ఇటు నేనున్నాను-అటు దేవుడులాగా చౌదరిగా రున్నారు' అన్నారు నాయుడుగారు.

పేరయ్య ఒక్క నిమిషందాకా ఏమీ అనలేదు. అతని హృదయంలో తను ఎన్నడూ ఊహించని కొత్త ఆనందమేదో ఒకసారిపొంగి వచ్చింది. కొంచెం సిగ్గుపడుతూ 'సరేనండీ' అన్నాడు.

నాయుడుగారీ విషయం చెప్పగానే వీరయ్యగారు విని, నిజంగా ఎంతో 'సంతోషిస్తూ మంచిపనేనండీ...ఏదో మీరుపూనుకొని పేరయ్యను ఓ యింటివాణ్ణి చెయ్యండి.' అన్నారు.

అందరూ అనుకొన్నట్లుగానే పేరయ్యకు ఆ సంవత్సరమే వివాహం అయ్యింది.

చౌదరిగారి దయవల్ల పేరయ్య గుడిసె రూపమేమారిపోయింది. వారింట్లో పనివాళ్ళే వచ్చి ఒంటి నిట్రాడిపాక వేసి మట్టిగోడలూ, దర్వాజాలూ పెట్టి ఇంటికి సున్నం కొట్టివెళ్ళారు.

పెళ్ళి అయిన కొద్దినెలలకే పేరయ్య భార్య కాపరానికి వచ్చింది.

పేరయ్య భార్య నాగమ్మ చాలా చురుకైన పిల్ల. పెద్ద అందగత్తె కాకపోయినా చూడటానికి ముచ్చటగా ఉంటుంది. మనిషి చామనచాయే అయినా వయసులో ఉన్నందున నాగమ్మ ఎఱుపనిపిస్తుంది. అన్నిటి కంటే ఎక్కువగా ఆమెలో సహజంగా ఉన్న సుగుణాలను చూచి పేరయ్య సంతోషించాడు. 'నాగమ్మ ఎంత మంచిదీ!-ఎంత పొదుపు! ఎంత జాగ్రత్త! ఇంత కంటే నాకేం కావాలీ' అనుకొనేవాడు పేరయ్య. కాపరానికి వచ్చిన రెండు నెలల్లోనే సంసారం చక్కదిద్దుకు పోవడం నేర్చుకొన్నది నాగమ్మ. ఇంటికి కావలసినవన్నీ సమకూర్చుకొన్నది. 'నువ్వు వంట ఎంత బాగా చేస్తావే-నాకింత మంచి భోజనందొరుకుతుందని నేనెప్పుడూ అనుకోలేదు' అంటూ తరచు మెచ్చుకొనేవాడు పేరయ్య. పొదుపుగా వాడటంవల్ల మిగిలిన డబ్బుతో ఆ యేడాది చివరలో నాగమ్మ ఓ పాడి గేదెను కొనగలిగింది. ఒక రోజున గడ్డ పెరుగు వేసుకొని తింటూ 'పెరుగు వేసుకొని తినేటంత భాగ్యం కలిగిం

దన్నమాట_ఓస్ పెరుగేమిటి నువ్వు నాకు దొరకటం అచ్చంగా భాగ్యం కాదూ!' అన్నాడు పేరయ్య భార్యవంక చూచి నవ్వుతూ. 'అహ! అల్లాగేం?' అంటూ ముసిముసి నవ్వులు నవ్వుతూ సిగ్గుపడింది నాగమ్మ. పేరయ్యకు తనముందు మంచి ముత్యాలు వెదజల్లినట్లనిపించింది.

పేరయ్య సంపాదన నిరాటంకంగా సాగిపోయింది. ఆరోజు కారోజు ఆ పని లాభదాయకంగా కన్పిస్తూ వచ్చింది. తిండికి సరిపోగా తనకూ నాగమ్మకూ బట్టలు కొనుక్కోగా డబ్బు కొద్దిగా మిగులుతుండేది. కష్టపడినకొద్ది లాభం కన్పించింది. లాభం కన్పించినకొద్దీ మరింత కష్టపడటం అలవాటు చేసుకొన్నాడు పేరయ్య. అక్కడ బావిదగ్గర అన్ని కడవల నీళ్ళు తోడిపొయ్యడం_ఊళ్ళో ఆ నీళ్ళు మోసుకొనిపోయి ఇళ్ళల్లో పొయ్యడం_ఇదంతా నిజంగా కష్టమైనపనే. కాని పేరయ్యకు అలవాటై పోయింది. 'ఏదైనా ఇంతే_అలవాటులో వుంది. కష్టమేమిటీ నా మొహం; దేవుడు నాకు బలం ఇచ్చింది కష్టపడటం కోసం కాదూ!' అనుకొనేవాడు పేరయ్య తను ఎక్కువ కష్టపడుతున్నానేమో అన్న ఆలోచన వచ్చినప్పుడల్లా.

అప్పుడప్పుడు నాగమ్మకూడా ఆ విషయమే అంటూ ఉండేది. 'నువ్వు మరీ ఎక్కువగా కష్టపడుతున్నావు. మరింక క్రొత్త వాడికలేమీ వొప్పుకోవద్దు. డబ్బు అవసరమేననుకో. చూడూ నీకో విషయం చెప్పాలనుకొంటున్నాను. ఇక్కడ నేను వెన్న తేలిగ్గా పోగు చేయగలను. వెన్నకాచి బస్తీకి పట్టుకెళ్ళి నాలుగయిదు ఇళ్ళల్లో వాడుకలు పెట్టుకొనివస్తా. అందువల్ల తక్కువ శ్రమతో మనకు ఎక్కువ లాభం వస్తుంది. ఏమంటావు?' అని అడిగింది నాగమ్మ.

'అబ్బే-అటువంటి పనులు నువ్వేమి చెయ్యొద్దు నేనేదో కాస్త సంపాదిస్తున్నానని మీ అయ్య నా చేతుల్లో పెట్టాడు సుఖపడతావని. ఈ

పనులన్నీ మీఅయ్యకు తెలిస్తే ఆయన చాలా నొచ్చుకొంటాడు. వద్దు—వద్దు—అంతగా మన కింకా డబ్బు అవసరమైతే—ఇంకా కాస్త కష్టం నేనే చేస్తాను." అన్నాడు పేరయ్య. ఆ విషయమై వాళ్ళిద్దరి మధ్యా కొంత వివాదం జరిగింది. కాని నాగమ్మ అతని కావిషయం కేవలం ఇష్టం లేదన్న సంగతి గ్రహించాక మళ్ళా ఏమీ అనలేదు.

తర్వాత వాళ్ళిద్దరూ ఆ విషయం మ చ్చిపోయి మామూలు ధోరణిలో పడ్డారు.

ఆ యేడు కృష్ణాపురంలో కొన్ని మార్పులు జరిగాయి. వీరయ్యగారూ సుబ్బయ్యగారూ ఇద్దరూ కలసి చాలా కృషిచేసి, పైవాళ్ళకు నచ్చ చెప్పి, కృష్ణాపురం నుండి బస్తీకి రోడ్డు వేయించారు. కృష్ణాపురానికి దక్షిణంగా మైలు దూరం వెళితే బస్తీకి వెళ్ళే కంకరరోడ్డు వస్తుంది. అక్కడదాకా రోడ్డు వేయించుకొనేసరికి కృషాపురం నుంచి బస్తీకి సరాసరి రోడ్డు పడినట్లయింది.

దాంతో ఆ ఊళ్ళో జనం అంతా పొంగిపోయారు. మరీ పేరయ్యకు పట్టరాని సంతోషం కలిగింది. తనుమంచినీటిబావికి వెళ్ళేదారేఅది. దాదాపు మైలుదూరం హాయిగా రోడ్డుమీదే బండి తోలుకొని పోవచ్చును. పూర్వం డొంకలోబడి పోవడమున్నా రావడమన్నా ఎంతో బాధగా ఉండేది. "కాని ఇప్పుడో! బలే—చక్కగా రోడ్డుపడింది 'హైయ్' అనంగానే గుఱ్ఱంలా పరుగెడుతోంది ఎద్దు' అనుకొని ఉబ్బిపొయ్యాడు. అందుకనే పేరయ్య అందరితోనూ వాళ్ళిద్దర్నీ గురించీ గొప్పగా చెప్పుకోవడం మొదలుబెట్టాడు. ఊళ్ళో అందరూ చెప్పుకొంటూనే ఉన్నారు—కాని వాళ్ళల్లో కొందరు నాయుడుగార్నీ మరికొందరు వీరయ్యగారినీ ప్రత్యేకంగా మెచ్చుకోవడం మొదలుపెట్టారు.

'నాయుడిగారి అల్లుడూ—జిల్లాబోర్డు అధ్యక్షుడి కొడుకూ ప్రాణస్నేహితులు. సుబ్బయ్య నాయుడుగారు తన అల్లుడితో అతనికి చెప్పించి

తద్వారా ఈ పని సాధించారు. లేకపోతే ఇది అయ్యేదా!' అని నాయుడు గార్ని గురించి మెచ్చుకొనేవాళ్ళంటే-'అదేం కాదోయ్-వెర్రివాళ్ళల్లారా-చూశారూ మన వీరయ్యగారి పెద్దకొడుకు-డాక్టరు చేస్తున్నాడే ఆయనా మన జిల్లా కలెక్టరుగారూ మంచి స్నేహితులు. వీరయ్యగారు అతనిద్వారా కలక్టరుగారికి చెప్పించి వారిచేత సరాసరి ఆర్డర్ వేయించేశారు. కాక పోతే మరొకరి తరమా!' అంటూ వీరయ్యగారిని మెచ్చుకొనేవాళ్ళు అనడం మొదలుపెట్టారు. అట్లా వివాదాలు కొన్ని తలఎత్తాయి. ఈ మాటలు ఆనోటా ఆనోటా బడి అసలు వాళ్ళదాకా కూడా వెళ్ళాయి. కాని వాళ్ళిద్దరూ ఏమీ అనకుండా అల్లా అనుకొనేవాళ్ళ అమాయకత్వానికి లోలోపల నవ్వుకొని ఊరుకొన్నారు.

కృష్ణాపురం నుంచి బస్తీకి రోడ్డు పడినప్పటినుంచీ అప్పుడప్పుడు బస్తీ నుంచి చిన్న కార్లలో నాయుడిగారింటికో, చౌదరిగారింటికో పెద్ద వాళ్ళు రావడం మొదలుపెట్టారు. సుబ్బయ్యగారింటికిగానీ వీరయ్యగా రింటికిగానీ కార్లో ఎవరు వచ్చినా ఊళ్ళోవాళ్ళ సంగతి ఎల్లా ఉన్నా పేరయ్యమట్టుకు ఎంతో సంతోషపడేవాడు. "చూశావురా రోడ్డుపడింది గనుక మనవూరికి ఇంతమంది పెద్దవాళ్ళు వస్తున్నారు" అంటూ కనపడిన వాళ్ళందరితోనూ చెప్పేవాడు. పోరా పిచ్చిపేరయ్యా-ఏమిటి మనవూరికి సరే పెద్దవాళ్ళే వస్తున్నారనుకో-వస్తే మన కొరిగిందేమిటీ అంట?" అనే వారు వాడి మాటలు విన్నవారంతా.

కాని పేరయ్య దృష్టిలో అల్లా కాదు. ఆ వచ్చినవాళ్ళు ఊళ్ళో అడుగు పెట్టినప్పటినుంచి వెళ్ళిపొయ్యేదాకా వాళ్ళకు తనకు చేతనైన సేవ అంతా చేసేవాడు. వెంట తీసికొనివెళ్ళి ఊరు నాలుగుమూలలూ చూపించి వచ్చేవాడు-తన ఊరునుగురించి వెయ్యివిధాల మెచ్చుకొంటూ. ఒక రోజున ప్రొద్దున్నే పట్నం నుండి పెద్ద ఇంజనీరు ఒకాయన తన

బృందంతో పాటుగా వచ్చి తనకు బాల్యమిత్రుడు కావడంచేత నాయుడు గారింట్లో బసచేశారు. వాళ్ళు రెండు చిన్నకార్లల్లో వచ్చారు, వాళ్ళవెంట రెండు పెద్దలారీలు కూడా వచ్చి అక్కడే ఆగాయి.

పేరయ్యకు పట్టరాని సంతోషమైంది. అతను ఆ వచ్చింది పెద్ద ఉద్యోగి అని తెలుసుకొన్నాడు. ఇక వాడా రెండురోజులూ పడ్డ హడావిడి ఇంతా అంతా గాదు. వీరయ్యగారి ఇంట్లో నుంచి పెరుగు తప్పాలాలు సుబ్బయ్యగారింటికి చేరవేశాడు. పొలాల్లో అక్కడా అక్కడా వారూ వీరూ పండించుకొంటున్న కూరగాయలు మోపెడు మోసుకొని వచ్చాడు. అందుకు కొంతమందిచేత అనవసరంగా చీవాట్లు తిన్నాడు.

రాత్రి ఒంటిగంటకే లేచి తన నీళ్ళపని తెల్లవారి ఆరుగంటలకల్లా పూర్తి చేసుకొని, వాళ్ళు నిద్రలేచేసరికి అందరికీ వేడినీళ్ళు పెట్టి, స్నానా లకు అన్నీ సిద్ధంచేశాడు. వాళ్ళు స్నానాలు చెయ్యంగానే వాళ్ళతువ్వాళ్ళు అవీ శుభ్రంగా ఉతికి ఆరవేశాడు. ఆపూట మధ్యాహ్నం భోజనాలయ్యాక మిగతావాళ్ళంతా వెళ్ళిపోయారు. పెద్ద ఇంజనీరుగా రొక్కరే ఆపూటకు ఉండిపోయారు నాయుడుగారి బలవంతంమీద. ఆ పూటసాయంకాలం ఆయన పేరయ్య వెంటరాగా ఆ గ్రామం అంతా తిరిగిచూచారు. అందుకు ఎక్కువ వ్యవధి పట్టలేదు. అప్పుడే వెనక్కు వెళ్ళటం ఇష్టంలేక ఆయన పేరయ్యతో "అలా పొలాలవైపు షికారుకు పోయివద్దాంపద" అన్నారు.

ఆరోజు రాత్రి ఆయనకు వసారాలో ప్రక్క దులిపివేసి, వారు దానిమీద నడుము వాల్చాక ఆయనకు కాస్త దూరంలో నేలమీద కూర్చున్నాడు పేరయ్య. ఆయనపేరయ్యను హృదయంలోకొంత అభిన్న దించారు. అటువంటి నౌకరు దొరకడం నాయుడుగారి అదృష్టమనుకొనాం రాయన.

ఇంజనీరుగారికి అగ్గిపెట్టి అందిస్తూ పేరయ్యా వినయంగా "ఏమండీ దొరగారూ!-మీరూ, ఎలక్ట్రీ దీపాల కచేరీలో పెద్ద ఉద్యోగస్థులని మా అయ్యగారన్నారండీ-నిజమేనాండీ"అని అడిగాడు."ఆయన నవ్వుతూ "అవును:" అని ఓ నిమిషం ఏదో ఆలోచించి-"అవును-అయితే-నీకు మా ఆఫీసులో పనేమైనా కావాలా?" అని అడిగారు.

"అబ్బే! అదేం! వద్దండీ-సుబ్బయ్యగారి దయవల్లా, వీరయ్యగారి దయవల్లా నేను ఇక్కడే హాయిగా పొట్టపోసుకొంటున్నాను. అది కాదండీ-మీకో చిన్న విషయం మనవి చేసుకొందామని వుంది..." అని భయపడుతూ ఆగాడు - మనస్సులో ఎన్నాళ్ళనుంచో తీరనికోరికగా ఉంటూ వచ్చిన విషయం బయటపెట్టడానికి జంకుతున్నవాడిలా. "ఏమిటోయ్-అదీ" అన్నారాయన. పేరయ్యా వెంటనే అందుకొని - "ఏంలేదండీ-మావూరికి మీదయవల్ల ఎలక్ట్రీ తెప్పించే వుపాయమేదైనా వుఁదా అని తమర్ని అడుగుదామని అనుకుంటున్నానండీ" అన్నాడు కొంచెం నట్టుతూ. "అదా సంగతి-ఊరివాళ్ళకోసం అడిగే విషయానికి నీకంత భయం దేనికీ-సరే వెళ్ళు అల్లాగేలే-మీ అయ్యగారితో మాటాడతాన్లే" అన్నారాయన.

ఇంజనీరుగారు వెళ్ళిపోయేటప్పుడావిషయమై నాయుడుగారితో ప్రస్తావిస్తూఇలాఅన్నారు."చూడండీ-మేమూ క్రొత్తలైనువేస్తున్నాం.అది మీవూరికిఒకటి రెండుఫర్లాంగులదూరంగా వెడుతుంది,మీరంతా-వూళ్ళో, ఓ వంద మంది చాలు, సంతకాలు పెట్టి పిటీషను పెట్టుకొంటే మీఊరికి లైట్ల సదుపాయం లభిస్తుంది. అల్లా చెయ్యండి. నావల్ల ఏదైనా అవసరమైవుంటే అది నేను చూసుకుంటాను. క్రొత్తప్లాన్ల ప్రకారం మెల్లమెల్లగా వస్తాయనుకోండీ-మనం కాస్త ప్రయత్నంచేస్తేతొందరగా వస్తాయి"అని చెప్పి ఆయన వెళ్ళిపోయారు.

ఆయన్ను అటు పంపించి సుబ్బయ్యగారు సరాసరి వీరయ్యగా

రింటికి వెళ్ళి వారితో విషయమంతా చెప్పారు. ఆయన చాలా సంతోషిస్తూ "అల్లాగే కానివ్వయ్యా—మనవూరికి అంత ఉపకారం జరగాలేగాని—అంతకంటె కావాల్సిం దేముందీ'' అన్నారు.

ఆ విషయమై వాళ్ళిద్దరూ గట్టి ప్రయత్నాలు చేశారు.

మరో ఆరునెలలకల్లా కృష్ణాపురంలో విద్యుద్దీపాలు మొదటిసారిగా వెలిగాయి.

x x x

ఊళ్ళోకి దీపాలు రావడంచూచి నలుగురూ నాలుగురకాలుగా మెచ్చుకొన్నారు. పేరయ్యకు అదికొంత గర్వకారణమయింది. ఆ రాత్రి అతను ఊరికి కొంచెందూరంగా వెళ్ళివస్తూ అక్కడక్కడా మెరుస్తున్న విద్యుద్దీపాల వంకచూచి బ్రహ్మానందపడ్డాడు. నిజంగా తన తల్లికి తన కష్టార్జితంతో విలువగల రత్నాలహారం చేయించి ఆమె కంఠసీమను అలంకరించినట్లుగా భావించాడు.

వీరయ్యగారు సంతోషపడుతూ 'విద్యుచ్ఛక్తి ఎల్లాగో వచ్చింది కదా చక్కగా రేడియోఒకటి అందరికీ అందుబాట్లో ఎందుకు పెట్టించకూడదూ!' అనుకొన్నారు.

మరునాడు నాయుడుగారిని పిలిపించి "చూడూ ఎలక్ట్రీ ఎల్లాగో వచ్చిందా, గుడిముందున్న ఖాళీజాగాలో చిన్న పార్కువేసి అందులో రేడియో ఒకటి పెట్టుకొందాము" అన్నారు. నాయుడుగారు కొంచెం వెనకాడుతూ "అదంతా డబ్బుతో కూడిన వ్యవహారం—కాస్త జాగ్రత్తగా ఆలోచించండి" అన్నారు.

"నాలుగు వేలు నేనిస్తాను. ఒకటోరెండో నువ్వు కలుపు. ఊళ్ళో కొంత వసూలు చేద్దాం. దాంతో అన్ని ఏర్పాట్లకు సరిపోతుంది. పార్కుమధ్యలో చిన్నగది ఒకటి కట్టించి, పార్కుచుట్టూ గోడలు పెట్టించాలి." అన్నారు వీరయ్యగారు. సుబ్బయ్యగారప్పటికీ మాటాడక

పోవడం చూచి వీరయ్యగారు మళ్ళీ ఇల్లాఅన్నారు. "నువ్వువెనకాడవద్దు. డబ్బువిషయం భయపడవద్దు. అసలు నువ్వేమీ ఇవ్వనేవద్దు. అవును విన్నాను. తూర్పుపొలం పండలేదనీ, కొంత అప్పుచేశావనీ. సరే—మరేంఫర్వాలేదు, మనలో మనకేమిటీ! కావల్సింది నేనిస్తాను. నువ్వుపూనుకొని పనులు చేయించు — నువ్వుచూస్తునే వున్నావుగా నాకు క్షణం తీరిక లేకుండావుంది....కాని ఒక్క విషయం–డబ్బుఅంతా నేనిచ్చానని ఎవరితోనూ అనకు–అయిన దాంట్లో కొంతకాకపోతే కొంత అయినా బయట నుంచి రాబడదాము," అని వెయ్యివిధాల చెప్పి నాయుడుగారిని ఒప్పించి వారిని ఆ పనికి పురమాయించారు చౌదరిగారు.

ఒప్పుకొన్న తర్వాత నాయుడుగారా విషయంలో శ్రద్ధవహించారు. హృదయపూర్వకంగా ఆయన ఆ పనిలో నిమగ్నం అయ్యారు.

అనుకొన్న పనంతా మూడునెలలలో అయి పోవాలని నిశ్చయానికి వచ్చారు. పేరయ్యను పిలిచి "ఒరేయ్–చూడూ–ఈపని వెంటనే కావాలి–నువు కాస్త శ్రమఅయినా చెప్పిన పనులన్నీ వెంటనేచేస్తుండు" అని చెప్పారు.

ఈ వ్యవహారం మొదలు పెట్టినప్పటినుంచీ చివరిదాకా పేరయ్య నాయుడుగారివెంట తిరుగుతూ సమస్తమైన పనులూ చేశాడు. దగ్గరఉండి రాయి పట్టించుకొనిరావడం, గోడలు కట్టేటప్పుడు అవసరమైన నీరు సమయానికి అందించడం—ఒక టేమిటి అన్నిపనులూ చేశాడు.

అతను తమఇళ్ళల్లో నీళ్ళు అలస్యంగా పోస్తున్నాడని ఒకళ్ళిద్దరు విసుక్కున్నారు, కొందరు కేకలు వేశారుకూడానూ. వీరయ్యగారికి విషయం తెలుసుగనుక ఏమీ అనలేదు. కాని వారింట్లో ఆడవాళ్ళు ఊరుకోలేదు. గట్టిగానే మందలించారు.

మొత్తంమీద ఆ మూడునెలల్లోనూ పేరయ్యఒళ్ళు హూనంహూనం అయింది, అతని భార్య కొంచెం విసుక్కుంటూ "ఏమిటయ్యాఇది—

ఊరికే వొళ్ళు విరుచుకొంటున్నావు—మన కేమన్నా ఒరుగుతుంది గను కనా" అన్నది చాలాసార్లు.

అనుకొన్నట్లుగా సరిగ్గా మూడునెలల్లో పని అంతా పూర్తయింది.

ఒకరోజున సుబ్బయ్యగారు వీరయ్యగారిని వెంటబెట్టుకొని వచ్చి పార్కూ, రేడియోగదీ అన్నీచూపించారు. ఇద్దరూ ఒకళ్ళనొకళ్ళు అభినందించుకొన్నారు. మరు నిమిషంలో వెనక్కుతిరి గిదూరంగానిలబడి ఉన్న పేరయ్యను మెచ్చుకొన్నారు వాడు పడ్డశ్రమకు.

పార్కుకు ప్రారంభోత్సవం చేయించడానికి సుబ్బయ్యగారు స్వయంగా వెళ్ళి వీరయ్యగారి పెద్దకొడుకు-డాక్టరుగార్ని వెంటబెట్టుకొని తీసికొనివచ్చారు. ఆరోజు ప్రొద్దున్న బీదవాళ్ళకు అన్నదానం జరిగింది సాయంకాలం ఓ చిన్నిసభకూడా ఏర్పాటు చేశారు.

ఆ సభలో డాక్టరుగారు మాటాడుతూ "మన గ్రామాన్ని ఇన్ని విధాల అభివృద్ధిలోకి తీసికొని వస్తున్న నాయుడుగారికి మీ అందరితరఫునా నా హృదయపూర్వక అభివందనాలు" అంటూ వారిని వేయివిధాల పొగిడారు.

దాంతో ఆ ఉళ్ళో అందరూ ఆయా సత్కార్యాలన్నీ నాయుడుగారే చేశారనీ—ఆయన దేవుడనీ చెప్పుకోవడం మొదలు పెట్టారు. మరీ ఆ ఉళ్ళో ఆడవాళ్ళంతా విడ్డూరంగా చెప్పుకొంటూ నాయుడుగారిని విపరీతంగా మెచ్చుకున్నారు. పదిరోజులపాటుఉండి వెళదామని వచ్చి అక్కడేఉండిపోయిన వీరయ్యగారి పెద్దకోడలుకు వాళ్ళ మాటలన్నీ వింటూంటే అరికాలమంట నెత్తికెక్కింది. అందరి దృష్టిలోనూ ఆ నాయుడు గారూ—ఆయన వెంట తిరుగుతున్న ఆపేరయ్యా మరీ ఇష్టులైపోవడం ఆవిడకు బొత్తిగా నచ్చలేదు.

అందువల్లనే వాడిమీద ఆవిడగారి పితూరీలు ఈమధ్య మరీ ఎక్కువయ్యాయి.

"అందరి యిళ్ళల్లోనూ పోసిగాని వాడిక్కడ పొయ్యడంలేదండి" అంటూ వీరయ్యగారికి వంటయింటిలో నుంచి పితూరీలు అందుతున్నాయి. వీరయ్యగారి పెద్దకోడలికి ఎందుకనో పేరయ్యమీద ఆగ్రహం కలిగింది. కాస్త అవకాశం కన్పించినప్పుడల్లా వాణ్ణి నాలుగూ దులిపేది. ఎడా పెడా చీవాట్లు పెట్టేది. అనవసరంగా నోరుపారేసుకొన్నా కూడా పేరయ్య విసీ వినకుండా తలవంచుకొని వెళ్ళి పోయేవాడు. అప్పుడప్పుడు "ఏమిటి ఆవిడగా రల్లా అసహ్యంగా తిట్టిపోస్తుంటే—సమాధానం చెప్పవేం" అని తన్నుతానే ప్రశ్నించుకొనేవాడు పేరయ్య. ఛా నేనేమీ అనకూడదు పొరపాటున ఏమాట అన్నా అదివారికి తెలుస్తుంది. నిజా నిజాలువారికితెలియవు. వారి మనస్సు కష్టపడుతుంది. నాకు ప్రాణాధారం కల్పించినవారికి అల్లామన స్సుకు కష్టం కలిగిస్తానా?—వద్దు—ఏదో అంటోంది...అన్నంత మాత్రాన నాకేంపోయిందీ. అనుకొని సమాధానపడేవాడు పేరయ్య. అతను మళ్ళీ ఇల్లా అనుకొనేవాడు 'అయినా నువ్వునౌకరువు.అటుచూడూ కాడికి ఎద్దును కట్టేశావా—అదిఎప్పుడైనా కాస్తబద్ధకంగా నడిస్తే నువ్వుఊరుకొంటావా? ఎన్నితిడతావూ! అంతే; నీ స్థితీ అంతే. అదెంతవినయంగా నడుచుకొంటుందో నువ్వూఅల్లాగే మెలగాలి. పేరయ్య ఇల్లా అనుకొన్నప్పుడు కొంచెం బాధపడినా తర్వాతతర్వాత మరింత వినయంగా మసలుకొనేవాడు.

x x x

ఇంతలో ఎవరూ ఆశించకుండానే క్రొత్తగా వచ్చిన శాసనం ద్వారా గ్రామపంచాయతీ ఎన్నికలు వచ్చిపడ్డాయి.

అన్ని ఉళ్ళల్లోలాగానే కృష్ణాపురంలో కూడా ఎన్నికల హడావిడి హెచ్చిపోయింది. అనుకోకుండానే పార్టీలు ఏర్పడ్డాయి.

ఎన్నికలలో నాయుడుగారిని నిలబెట్టాలని కొంతమందీ- వీరయ్య

గారిని నిలబెట్టి గెలిపించాలని కొంతమందీ అనుకొంటూ రెండుముఠాలుగా చీలిపోయారు. దాంతో రెండుపార్టీ లేర్పడ్డాయి. కొంతకాలందాకా వాళ్ళలో వాళ్ళే తగాదాపడ్డారు. కాని ఇటునాయుడుగారు కానీ అటుచౌదరిగారు కానీ అసలీవిషయమే పట్టించుకోలేదు. వీరయ్యగారు నిల్చుంటారులే మనకెందుకని సుబ్బయ్యగారూ-సుబ్బయ్యగారు నిల్చుంటారులే మనకెందు కాశ్రమ అని వీరయ్యగారూ అనుకొని ఊరుకొన్నారు.

అలా అనుకొంటూ ఉండగా ఎన్నికలు దగ్గిర పడ్డాయి. ఒక కక్ష వాళ్ళంతా కలసి నాయుడుగా రింటికి వెళ్ళి మీరు నిల్చోండి—మిమ్మల్ని గెలిపిస్తామని ఆమాటాఈమాటాచెప్పి కొంతవరకు సుముఖుల్ని చేసుకొన్నారు. చివరకు నాయుడుగారు 'అయినా ఆయనకు తీరిక ఉండదు. ఎల్లాగో నువ్వే ఉండవయ్యా — ఆపనులన్నీ కాస్తచూస్తూ ఉండు అంటారు వీరయ్యగారు. కనుక నాకెల్లాగోతప్పదు' అని అనుకొని వాళ్ళతో "సరేలెండి" అన్నారు. ఆవిషయము తాము స్వయంగావెళ్ళి వీరయ్యగారితో చెప్పి వద్దామనుకొన్నారు. కానిఏదో అశ్రద్ధవల్ల పడలేదు. "పరవాలేదులే — ఊళ్ళో ఉన్న మనిషితో ఎంతలో చెప్పాలి— అందులో వీరయ్యగారితో ఒక్కమాటచెప్పడంఏంభాగ్యమ్—ఆయన సరసుడు. సరే అంటారు.' ఇలా ఆయన ఎన్నిసార్లో అనుకొన్నారు. కాని ఆయన ఇలాఅనుకొంటూ ఉండగానే అనుకోకుండా ఓఅవాంతరం వచ్చిపడింది. అల్లుడికి జ్వరంగాఉన్నదనీ వెంటనే రమ్మనమనీ మద్రాసునుంచి 'తంతి' వచ్చింది. వెంటనేఆయనఅక్కడకు వెళ్ళారు. వెళ్ళినెల రోజులదాకా అక్కడే ఉండిపోయారు. ఆనెల రోజుల్లో ఊళ్ళోఎన్నికల ప్రచారం ఎక్కువయింది. "నాయుడుగారుసర్వసమర్థుడనీ గ్రామోద్ధారకుడనీ, దీపాలు తెప్పించడం, రోడ్డువేయించడం, పార్కు వేయించి రేడియో పెట్టించడం వంటి అన్ని పనులూ ఆయనే చేయించా

రనీ—ఇల్లాగా ప్రచారం సాగిపోయింది. అందువల్ల ఆయన్ను లెక్క-లేకుండా గెలిపిస్తామని వారిని నిలబెట్టినవాళ్ళు తమ ఎదుటి కక్షవాళ్ళను రెచ్చగొట్టారు. రెండవకక్ష వాళ్ళుకూడా ఊరుకోలేదు. ధైర్యంచేసి ఈ మాటలు వీరయ్యగారి తగ్గరకుమోసి నాలుగు కలిపి చాడీలు చెప్పారు. "చూడండి వీరయ్యగారూ-అయనేం ప్రచారంచేస్తున్నాడో...అన్ని ఘన కార్యాలూ ఆయనేసాధించాడట. అందుకని మీకునిలబడే దమ్ములు లేక నిలబడటంలేదట" అంటూమెల్లగా పురిఎక్కించారు. అయన మొదట్లో "పొండయ్యా మీమాటలకేం-సుబ్బయ్యఅటువంటివాడుకాదు" అనివాళ్ళను పంపించివేశారు. కాని వాళ్ళు పదిసార్లు ఆయనచుట్టూ తిరుగుతూ పది రకాలుగాచెప్పేసరికి ఆయనమనస్సూమారింది. చివరకు 'పోనీనేనుతనకు స్నేహితుణ్ణికదా—ఇదుగోనయ్యా నేనుంటానీ సారిఅనినాకు వచ్చి చెప్ప కోడదూ! చెప్పకుండావెళ్ళి మద్రాసులో కూర్చొనిఇక్కడ వీళ్ళచేతఇల్లా ప్రచారం చేయిస్తాడూ!' అని అనుకొన్నారు.

"చూస్తాను ఎలాగెలుస్తాడో — నేను నిలబడితే నాకెదురు నిలబడే సాహసంఉందా అని" అను కొంటూ ఆయన దాదాపు ఓ నిశ్చయానికి వచ్చారు. అల్లా అనుకొంటూ ఆయన లోపలకు వచ్చారు. అక్కడ భార్యా కోడలూ కలసి అవిషయమే ప్రస్తావించారు. కోడలు ధైర్యంచేసి అత్తగారి చాటున నిలబడే ఇల్లాఅన్నది. "మీదు మరేమీఅనుకోకుండావుంటే ఓ విషయంచెబుతాను. మన కింత ఆస్తివుండీ—ఇంత హోదావుండీ ఆ సుబ్బయ్యగారికి భయపడటమా! ఆ పేరయ్యమీద ఆధారపడటమా! అసలీ జరిగే ప్రచారనికి మూలకారణం పేరయ్య. వాడి దొంగ వినయంచూచి నేనూ మొదట్లో అందరిలాగే అనుకొని మోసపోయాను. సరే అదంతా ఎందుకులెండి. ఆయనగారెదో సాధించారనేగదా చెప్పుకొంటున్నదీ. అంతకంటే మంచిపని అందరికీ కన్పడేలా మీరు మరొకటిచెయ్యండి!"

"సరేబాగానేఉంది—అదే ఏంచేయమంటావ్" అన్నారు వీరయ్య గారేదో ఆలోచనలోపడి.

"అదే నేనూ చెప్ప బోతున్నా; మన వూరికి మంచినీటి కరు వుందా—ఆకరువు పోయ్యేపనిచెయ్యండి. దాంతో వూరువూరంతా మన వైపు తిరుగుతుంది. అంతేకాకుండా మాకేమో వాడిమీద—ఆపేరయ్య గాడి మీద ఆధారపడే అవస్థా తప్పుతుంది.

"అయితే —ఇంతకీ ఏంచెయ్యమంటావమ్మా." అని మళ్ళీ అడిగారు వీరయ్యగారు.

"ఏ ముందండీ—నీటికరువు పోగొట్టడమెంత సేపూ—ఆబావి వుందా—దాన్ని కాస్త పెద్దదిచేసి అక్కడ మోటరుపెట్టి 'పంపు' చేస్తే ఊళ్ళోవచ్చి పడతాయి నీళ్ళు. దాంతో ఊళ్ళోగంగ ప్రవహిస్తుంది. ప్రస్తుతానికి రబ్బరుగొట్టాలు పెట్టించండి. తర్వాత తర్వాత మందిసొమ్ము పోగయ్యాక ఇనపవి మంచివి వేయించుకోవచ్చు".

కోడలు చెప్పిన ఉపాయం ఆయన మనస్సుకు బాగా నచ్చింది. "బావుందమ్మాయి —బాగా చెప్పావ్—ఎల్లాగైనా చదువుకొన్న పిల్లవు కదూ" అని మెచ్చు కొంటూ ఆయన వాకిట్లోకివెళ్ళి ఆవిషయం తన "పార్టీ" వాళ్ళతో చెప్పారు. వాళ్ళంతా బావుందంటే బావుందన్నారు. అడక్కుండానే తలో అయిదువందలూ వెయ్యాచందగావెంటనే ఇచ్చేశారు

అనుకొన్నపని వారం తిరక్కముందే పూర్తి కావాలని అందరూ పట్టుపట్టారు.

X X X

బస్తీనుంచి ఒక ఇంజనీరు ముప్ఫైమంది కూలీలువచ్చి వీరయ్యగారు తలపెట్టిన పని అనుకొన్నదానికంటె ముందుగా చేసి వెళ్ళారు. ఈ క్రొత్తపథకానికి ప్రారంభోత్సవం చెయ్యడానికి ఓ మంత్రి గారిని పిలుచుకొనివచ్చారు.

మంత్రిగారు మరోరెండురోజులకు ఎన్నికలనగా ఆ ఊరువచ్చారు. పెద్దసభ ఏర్పాటు చేశారు వీరయ్యగారి తరపు మనుష్యులు. ఆ సభలో

ఆయనమాటాడుతూ వీరయ్యగారి దాతృత్వాన్ని వేనోళ్ళ కొనియాడారు. ఆ ఊళ్ళో అంతవరదాకా జరిగిన ప్రతి మంచిపనికీ ఆయనే కారకులనీ —ఆవిషయాలన్నీ తనకు మొదటినుంచీ తెలుసుననీ చెప్పారు. అవిష యమై రెండువిముషాలు మాటాడి, తనపార్టీనీ గురించీ దేశరాజకీయాలను గురించీ ఒక పెద్దఉపన్యాసం ఇచ్చి, చివరకు వీరయ్యగారు త న పా ర్టీ మనిషనీ. వారిని గెలిపిస్తే నిజంగా తన్ను గెలిపించినట్టుగా భావిస్తాననీ చెప్పి ఉపన్యాసం ముగించారు. టాపులేని చిన్నకారులో ఆయన్ను ఊరే గించి ఘనంగా గౌరవించారు ఆఊళ్ళో.

మంత్రిగారు వచ్చినరోజుననే సుబ్బయ్యగారు కూడా స్వగ్రామం తిరిగి వచ్చారు. వచ్చీ రావడంతోనే ఆయన్ను గెలిపిద్దామను కొంటున్న వారంతావచ్చి కలుసుకొన్నారు. సుబ్బయ్యగారు "నా కెందుకయ్యా ఈ గొడవంతానూ—నేను వెళ్ళి వారితో చెప్పివస్తాను—నాకక్కరలేదీపదనీ అని"అన్నారు. కానివారు ఆయనతో "అదేమిటండీ ఇందాకా వచ్చాక ఇప్పుడు వెళ్ళితే మీరెంత లోకువై పోతారూ —అంతకంటే వెయ్యి రెట్లు మేమెంత చులకనై పోతాము!" అంటూ ఆయన్నా రోజంతా ఇంట్లోంచి బయటకు రానీయలేదు.

ఆరోజు సాయంకాలం సభఅయ్యాక తేనీటి విందులూ—భోజ నాలూచాలా కోలాహలంగా జరిగాయి. ఆమరునాడే నీళ్ళపంపులన్నీ ఒక్క సారే వదిలిపెడతారనీ—వీరయ్యగారింటిదగ్గర వేసిన పందిట్లోనిలబడి ఒక చిన్నమీట నొక్కితే అన్ని పంపులలోనుంచీ గంగ ప్రవహిస్తుందనీ ఊళ్ళో ఆడవాళ్ళంతా వింతగా చెప్పుకొన్నారు. ఆరోజు సాయంకాలం వీరయ్యగారింటికివెళ్ళాడు పేరయ్య. మొదట వీరయ్యగారిదర్శనం కాలేదు. వారికోడలు ఎదురుపడి 'ఒరేయి—పేరయ్యా!—నువ్వింక మా గుమ్మంలోకి రానక్కర్లేదు. నీ నీళ్ళూ అక్కర్లేదు. నీసేవా అక్కర్లేదు. వెళ్ళు—వెళ్ళి ఆ సుబ్బయ్యగారింట్లోనే పడివుండు" అనిఖచ్చితంగా చెప్పేసింది.

వీరయ్యగారిదగ్గరకు వెళ్ళి పేరయ్య ఆవిషయం చెప్పుకొన్నాడు. ఆయనకోపంగా "అవును మాకోడలు బాగానే చెప్పింది. వెళ్ళు. ఇవ్వాళతో నీకూ. రేపటితో ఆ సుబ్బయ్యకూ తెలిసి వస్తుందిలే వెళ్ళు. —నాకెదురుగా నిలబడి నా కాష్టే కోపం తెప్పించకు" అని ఆయన చరచరా లోపలకు వెళ్ళిపోయారు.

పేరయ్య నిర్ఘాంతపోయి ఒక్క నిముషం అల్లాగే నిలబడి బరువై కృంగిపోతున్న హృదయంతో మెల్లగా బయటకు వచ్చాడు. అతను అడుగులో అడుగు వేసుకొంటూ నాయుడుగారి దగ్గరకు వెళ్ళి విషయమంతా చెప్పుకొన్నాడు. ఆయనా, ఆయన దగ్గరఉన్న ఆయన మిత్రులూ విని "ఏం ఫర్వాలేదులేరా నువ్వు విచారపడకు. మేం చూస్తాంలే" అంటూ ఓదార్చడానికి ప్రయత్నం చేశారు. కాని పేరయ్యకు హృదయం మరింత భారంగా, బాధగా కన్పించింది. మాటాడకుండా బయటకువచ్చేసి సరాసరి గుడిలోకివెళ్ళి అక్కడే చాలా సేపు కూర్చున్నాడు.

రెండుగంటలవుతున్నా ఆకలి వేయలేదు పేరయ్యకు. అప్పటిదాకా ఆగుడిలో ఒంటరిగా కూర్చుని అంత సేపు తానేమి ఆలోచించాడో అతనికే తెలియదు. బయట అక్కడక్కడ కోలాహలంగా ఉన్నది. షావుకారు కొట్టుకు వెళ్ళి వద్దామని బయలుదేరాడు. అన్ని పంపులలో అంతకుముందే నీరువదిలారు. చాలామంది జనం అక్కడక్కడగుంపులుగూడిసరసపల్లాపాలు ఆడుకొంటూ అక్కడే కూర్చుని ఉన్నారు. పేరయ్య వాళ్ళందరినీ చూస్తూ చేతులు వెనక్కు కట్టుకొని మెల్లగా ముందుకు నడిచాడు. ఒక్క చోట కొంతమంది 'ఒరేయి పేరయ్యా' అని పిలిచి అతను దగ్గరకువచ్చిన తర్వాత 'ఏరా పీపాబండి పేరయ్యా— చూశావా మరీ నీళ్ళు తెప్పించావ్ అంటూఎగతాళిచేశారు. పేరయ్య పెదిమ కదల్చలేదు. ముందుకువెళ్ళి షావుకారుతో "నీకునేనేమీ బాకీలేనుసుమా" అనిచెప్పిమళ్ళావెనక్కుతిరిగి యింటి

దారి పట్టాడు. 'ఓరి పిచ్చి పేరయ్యా—నువ్వు బాకీపడ్డావని ఎవరన్నార్రా' అన్నాడు షావుకారు నవ్వుతూ.

పేరయ్య పార్కుదగ్గర నిలబడి ఎదురుగా ఉన్న పంపువంక చూచాడు ఓక్షణంపాటు.

అందరికీ అందుబాటులోకి నీళ్ళురావడం పేరయ్యకు ఒక రకంగా ఆనందంగానే ఉన్నది. కాని ఇదంతా తన్ను—ఏడిపించాలని చేసినపని అని స్పష్టంగా తెలిసివచ్చింది.

ఒకసారి పంపుదగ్గరకువెళ్ళి కొళాయితిప్పి ఇన్ని మంచినీళ్ళు నోట్లో పోసుకొన్నాడు. దానికి గజం దూరంలోఉన్న కుండు కన్పించింది. దానిలోకి తొంగిచూస్తూ పేరయ్య ఓ నిమిషం అల్లాగే నిలబడి పోయాడు. ఆ కుండులో అప్పటికే సగానికి నీళ్ళున్నాయి. దానికి అడుగునుంచి నీళ్ళునింపే గొట్టం ఉన్నది. అందులోనుంచి నీళ్ళు పైకి వస్తున్నాయి. కుండు వేడినీళ్ల కుండలాగా ఉడుకుతున్నట్లుగా ఉంది. బుడగలు వస్తున్నాయిపైకి.

తన హృదయమూ అల్లాగేఉన్నట్టు కన్పించింది ఆ సమయంలో పేరయ్యకు. అంతవరదాకా నిర్మలంగాఉన్న అతని హృదయంలో నిస్పృహ, నిరాశా భావాలు బుడగల్లాగా పైకి తోసుకొనివస్తున్నాయి. అతని హృదయం దుఃఖంతో కృంగిపోయింది. అంతలో కోపంవచ్చింది. పేరయ్య పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ ఇంటికి చేరుకున్నాడు—ఏదో ఒక నిశ్చయానికి వచ్చి దాన్ని క్షణాలమీద నెరవేర్చబోతున్న వాడిలాగా.

గుమ్మంలోనుంచే భార్యను పిలిచి "పదవే మనకింక ఈవూళ్లో తావులేదు. ఇవ్వాళతో ఋణం తీరిపోయింది. నన్ను దగ్గరకు తీసి ఆదరించిన పెద్దవాళ్లిద్దరూ అనవసరంగా కలహాలు పెంచుకొని చివరకు

నన్నిల్లా చేశారు. పోదామ్‌పద—మరోవూరు పోదామ్. ఆ నాలుగు గిన్నెలూ ఓ గోతాంలో సర్దేసెయ్యి. గేదెను మీ పుట్టింటికి తోలేసిరా—మరో వూళ్ళో పొట్టపోసుకొందామ్. రాజులకైతే ఒక వూరుగానీ పని వాళ్ళకు ఒక వూరేమిటి..." అన్నాడు పేరయ్య. నాగమ్మ అతనికెదురుగా నిలబడి అతని కళ్ళల్లోకి చూచింది. కనుకొలకుల్లో దాగి ఉన్న కన్నీటిని తేలిగ్గానే గుర్తుపట్టింది. విషయమంతా అంతకుముందే విన్నది. కాని పేరయ్య అంతగా దిగులుపడతాడని అనుకోలేదు. "అదేమిటయ్యా—అల్లా దిగులుపడతావ్—కష్టపడేవాళ్లం బ్రతకలేకపోతామా—ఇక్కడే వుందామ్" అన్నది నాగమ్మ.

"కాదు—నేనీవూళ్లో ఇంక తిరగలేను. పద వెళ్లిపోదామ్" అన్నాడు పేరయ్య.

"అదేమిటీ తిరగ లేక పోవడమేమిటీ—నువ్వేం దొంగతనం చేశావా—ఎవరికైనా ఓ పిసరంత అపకారం చేశావా—దేనికీ అంత ఇదవుతావూ?" అని అడిగింది నాగమ్మ.

"అదేమీ కాకపోయినా — నే నుండలేను ఈ వూళ్ళో. నా మూలంగా అనేక కలతలూ తగాదాలూ వస్తున్నాయి. అందువల్ల వెళ్ళిపోవాలి" అన్నాడు పేరయ్య తేల్చి చెబుతూ.

"పోనీ అల్లాగే వెళదాంలే. రేపటిదాకా ఉండి అదేదో ఎవరు గెలుస్తారో చూసివెళదాము. ఒకవేళ నాయుడుగారు గెలిస్తే నీకేదైనా దారి చూపిస్తారేమో!" అన్నది నాగమ్మ తన హృదయంలో దాగిఉన్న ఆశాభావం వ్యక్తంచేస్తూ. ఆ మాటలు కొంచెం పరధ్యాన్నంగా వింటున్న పేరయ్య ఒక్కసారి ఉలిక్కిపడి ఇల్లా అన్నాడు. "అమ్మో వద్దు! నాయుడుగారు ఇంక నాకేమైనా చేస్తే అటు చౌదరిగారికి కోపం వస్తుంది, ఆ తర్వాత పీ రిద్దరిమధ్యా వైషమ్యాలు ఇంకా పెరుగుతాయి. వద్దు ఇవ్వాళే వెళ్ళిపోదాము. వాళ్ళిద్దరిలో ఎవరు గెల్చినా నా కొకటే—

నా కీయన తల్లీ ఆయన తండ్రీ. లే—అవన్నీ సర్దేసెయ్యి."

"సరే—అల్లాగే వెళదామ్. ఎక్కడైనా బ్రతికలేకపోము. నీళ్ళు పొయ్యడం కాకపోతే మరోపని చేద్దువుగాని. అవును పూర్వం నేనోసారి చెప్పానే, అదే, వెన్నా నెయ్యీ అమ్ముకొని పొట్టపోసు కొందాం— ఒక్క గంటలో సామాను సర్దేస్తాను" అన్నది నాగమ్మ.

నాగమ్మ మాటలకు పేరయ్య సంతోషించాడు. ఆ రోజు చీకటి పడుతుండగా సామాను పీపా బండిమీద వేసి, చేతిలో తాడు పుచ్చుకొని ముందు పేరయ్యా, ఆతని వెనక నాగమ్మా బయలుదేరి ఊరి చివరకు వచ్చారు. ఊరు విడిచి రెండు ఫర్లాంగులు వచ్చాక అక్కడోసారి ఆగి వెనక్కు తిరిగి చూచి ఇద్దరూ కంట నీరు పెట్టుకొన్నారు. నాగమ్మ తల్లితోనైనా చెప్పిరాలేదు. పేరయ్య నాయుడు గారితో ఒక్క మాటైనా అనలేదు. ఊరివైపు చూడగానే పేరయ్యకు తను చిన్నతనం నుంచీ తిరిగిన ఆ ఊరి నాలుగు మూలలూ—వాటితో అల్లుకొని పోయిన కష్టసుఖాలతో కూడుకొన్న స్వీయజీవితాధ్యాయాలూ అన్నీ జ్ఞాపకం వచ్చాయి, అతని చెక్కిళ్ళపై నుండి కన్నీటి బిందువులు జారాయి.

అతను నాగమ్మ చూడకుండా తువ్వాలఅంచుతో కళ్ళు తుడుచుకొన్నాడు. బొంగురుపోతున్న గొంతుతో "హయ్!" అని ఎద్దును అదిలించాడు.